క్లుప్తంగా

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు



వీరులపాడు: ప్రజాదర్బార్ దృష్టికి వచ్చే సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. వీరులపాడు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నారని, అధికారులు కూడా అలసత్వం వహించకుండా సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చేపడుతున్న నీటి తొట్టె నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుంధతిదేవి, తహసీల్దార్ హుస్సేన్, ఏపీఓ జనార్దన్, ఎస్ఐ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పేట విద్యార్థినులకు ప్రథమ బహుమతి



జగ్గయ్యపేటఅర్బన్: విజయవాడలోని బిషప్ అజరయ్య బాలికల హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఈఎండీపీ(ఎంట్రప్రెన్యూర్ షిప్) సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమంలో జగ్గయ్యపేటకు చెందిన జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనపరిచారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు హేమలత, సల్మా కలిసి సైన్స్ ఎక్స్‌పోలో నాచురల్ సోప్‌ను తయారీ విధానాన్ని ప్రదర్శించి జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతిని గెలుచుకున్నట్లు వివరించారు. ఈసందర్భంగా జగ్గయ్యపేట జెడ్పీ బాలికల హైస్కూల్ హెచ్‌ఎం ఎ.లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే పారిశ్రామిక, వ్యాపారపరంగా వారిలో నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి సైన్స్ ఎక్స్‌పో చక్కటి వేదిక అని పేర్కొన్నారు. ప్రతిభచూపిన విద్యార్థులతో పాటు వారికి మార్గదర్శకులుగా వ్యవహరించిన ఉపాధ్యాయులు జయవాణి, సుబ్బలక్ష్మిని అభినందించారు.

ముస్తాబవుతున్న రామాలయాలు



జగ్గయ్యపేట: ఈనెల ఆరోతేదీ శ్రీరామనవమి పండుగ నేపథ్యంలో జగ్గయ్యపేట నియోజకవర్గంలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలను భక్తులు ముస్తాబు చేస్తున్నారు. ఆలయాలకు రంగులు, తాటాకు పందిళ్లు వేసే పనిలో ఆలయ నిర్వాహకులు నిమగ్నమయ్యారు. పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారు, వేదాద్రిలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయాల్లో శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

పుస్తక పఠనంతో ఎంతో మేలు



కొణకంచి(పెనుగంచిప్రోలు): పుస్తక పఠనం ఎంతో అవసరమని గ్రంథాలయాధికారి అల్లూరి రామచంద్రుడు అన్నారు. అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. పుస్తక పఠనం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమృత, సీహెచ్ పద్మ పాల్గొన్నారు.

16 నుంచి కేబీఎన్‌లో వేసవి శిక్షణ తరగతులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల యూజీసీ ఉమెన్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ మహిళలకు కంప్యూటర్ అప్లికేషన్స్, డీటీపీ, బ్యూటీషియన్, మగ్గం వర్క్స్, కార్టూనింగ్, మెహెందీ డిజైన్స్, జుంబా డ్యాన్స్, ఫ్రెంచ్ లాంగ్వేజ్, విద్యార్థులకు వేదిక్ మ్యాథ్స్, జుంబా డ్యాన్స్, వెస్ట్రన్ డ్యాన్స్, స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇస్తామని వివరించారు. ఈ శిక్షణ పూర్తిగా ఉచితమని, వివరాలకు 74169 26563, 90307 66090 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బంతి బంతికి బెట్టింగ్

- గ్రామాలకు పాకిన బెట్టింగ్ భూతం
- ఛిద్రమవుతున్న జీవితాలు
- కోట్లల్లో సాగుతున్న పందేలు
- ఆఫ్‌లైన్ కంటే ఆన్‌లైన్‌లో జోరుగా పందేలు
- నందిగామ, కంచికచర్ల కేంద్రాలుగా పెద్దఎత్తున బుకీలు
- కట్టడి చేయలేని ఖాకీలు



కంచికచర్ల: ఐపీఎల్ క్రికెట్ పోటీలను చూసి కొందరు ఎంజాయ్ చేస్తుంటే మరికొందరు బెట్టింగ్‌ల కారణంగా తమ కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. బెట్టింగ్ భూతం కారణంగా అత్యధిక శాతం మంది అప్పుల పాలవుతున్నారు. ఇంజినీరింగ్, ఇంటర్ చదివే విద్యార్థులతోపాటు యువత, ఇతరరంగాలకు చెందిన వ్యాపారులు, పలువురు ధనవంతులు ఈ క్రికెట్ బెట్టింగ్ బారినపడి ఆర్థికంగా తీవ్రనష్టాలపాలవుతున్నారు. విద్యార్థులు సైతం పాకెట్ మనీగా తెచ్చుకున్న డబ్బులతో బెట్టింగ్‌లు పెడుతున్నారంటే పరిస్థితి ఈ వ్యసనం ఏస్థాయికి వెళ్లిందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

చేతులు మారుతున్న రూ.కోట్లు..

ఆఫ్‌లైన్ కంటే ఆన్‌లైన్‌లోనే ఎక్కువగా ఈ పందేలు సాగుతున్నాయి. బెట్టింగ్ యాప్‌లు, క్రికెట్ యాప్‌ల ద్వారా భారీస్థాయిలో పందేలు సాగుతున్నాయి. నందిగామ, కంచికచర్ల పట్టణాల్లో పలువురు వ్యక్తులు బుకీలుగా మారి ఈ బెట్టింగ్ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

బెట్టింగ్ యాప్‌లతో మోసం....

గతంలో పేకాట, కోడిపందేల నిర్వహణపై పోలీసులు దాడులు చేసి జూదరులను అదుపులోకి తీసుకునేవారు. ఇందుకోసం గ్రామాల్లోని తమ ఇన్‌ఫార్మర్ల ద్వారా నిఘా ఏర్పాటు చేసేవారు. కాని ప్రస్తుతం బెట్టింగ్ బాబులు రూట్ మార్చారు. బెట్టింగ్ వ్యవహారాన్ని ఆన్‌లైన్‌లో సాగుతుండటంతో ఈ వ్యవహారాన్ని కట్టడి చేయడం పోలీసుల తరం కావడం లేదు. బెట్ 365 అనే ఆన్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి ఫోన్ల ద్వారానే బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. పోలీసుల నిఘాకు అందకుండా ఇంట్లోనే ఉంటూ బుకీ ఏజెంట్లు బెట్టింగ్ రాయుళ్లతో పందేలు కాయిస్తున్నారు. క్రికెట్ పోటీలకు సంబంధించి బంతి బంతికి, ఓవర్ ఓవర్, మ్యాచ్ ఫలితం, సదరు క్రికెట్ చేసే పరుగులు, తీసే వికెట్లు ఇలా ప్రతి అంశాన్ని బెట్టింగ్‌గా మార్చి ఈ బెట్టింగ్ రాయుళ్ల జేబులు గుల్ల చేస్తున్నారు. పందెం గెలిచిన గంటల్లోనే డబ్బులు ఆన్‌లైన్ పేమెంట్ చేస్తుండటంతో రోజురోజుకు క్రికెట్ బెట్టింగ్ ఆడే వారి సంఖ్య పెరుగుతోంది. కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట తదితర ప్రాంతాల్లో బెట్టింగ్ కోట్లాది రూపాయల్లో సాగుతోందని చెప్పవచ్చు.

గ్రామాలకు పాకిన బెట్టింగ్ భూతం.....

నిన్న మొన్నటి వరకు పట్టణాలకే పరిమితమైన బెట్టింగ్ భూతం నేడు గ్రామాలకు పాకింది. గ్రామాల్లోని పలువురు క్రికెట్ బుకీల అవతారం ఎత్తినట్లు సమాచారం. ముఖ్యంగా కంచికచర్ల మండలం పెండ్యాల, కీసర, గండేపల్లి, పరిటాల, కంచికచర్ల, నందిగామ మండలంలోని జొన్నలగడ్డ, రామిరెడ్డిపల్లి, నందిగామ, అనాసాగరం తదితర గ్రామాల్లో ఈ బెట్టింగ్ వ్యవహారం పెద్దఎత్తున సాగుతోంది.

చితికిపోతున్న బతుకులు..

బెట్టింగ్‌కు అలవాటుపడినవారు అధికవడ్డీలకు అప్పులు చేస్తూ, ఆస్తులను తాకట్టుపెడుతూ, తెగనమ్ముతూ ఇలా ఉన్న ఆస్తినంతా సర్వం బెట్టింగ్‌ల్లో పెడుతూ తీవ్రంగా నష్టపోతున్నారు. ఆనక జనానికి ముఖం చూపించుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నందిగామ, కంచికచర్ల ప్రాంతాల్లో అధికంగా నివసించే పేద, మధ్యతరగతి కుటుంబాలవారే అధికంగా ఈ బెట్టింగ్‌ల వారి పడి ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంటూ విలవిలలాడుతున్నారు. కొందరు ప్రాణాలు తీసుకుంటుంటే మరికొందరు ఊరు వదిలి వెళ్తున్నారు. బెట్టింగ్ కోసం చేసిన అప్పులు చెల్లించలేని స్థితిలో వడ్డీ వ్యాపారులు పెట్టే ఇబ్బందులు తట్టుకోలేక ఇళ్లలోని బంగారం తాకట్టు పెడుతున్నారు. చివరికి వాటిని విడిపించకపోతుండటం కుటుంబాల్లో వివాదాలకు కారణమవుతోంది.ఇలా బెట్టింగ్ భూతం గ్రామాలను పట్టిపీడిస్తోంది. ఇకనైనా పోలీసులు తగిన చర్యలు తీసుకుని గ్రామాల్లో బుకీలుగా వ్యవహరిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవడం ద్వారా ఈ బెట్టింగ్ భూతం బారి నుంచి యువతను కాపాడాలని నందిగామ నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

ప్రాణాలు కోల్పోతున్నారు...

- గతంలో క్రికెట్ బెట్టింగ్ కారణంగా తీవ్ర అప్పుల పాలై మానసికవేదనతో కంచికచర్ల మండలంలో ఓ చిరుద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు.
- నందిగామ మండలంలోని ఓచిన్న గ్రామంలో ఓ విద్యార్థి బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొంది 15రోజులపాటు మృత్యువుతో పోరాడి మృతిచెందాడు.
- ఇటీవల అధికారపార్టీకి చెందిన ఓ నాయకుడు నిర్వహించిన క్యాసినోలో నందిగామకు చెందిన ఓ కానిస్టేబుల్ రూ.40వేలు పోగొట్టుకున్నాడు.
- ఈనెల ఒకటో తేదీన ప్రభుత్వ సామాజిక పింఛన్లు పంపిణీ చేయాల్సిన నగదు రూ.7.50లక్షలను ఓ సచివాలయ ఉద్యోగి క్యాసినో, బెట్టింగ్‌లో పెట్టి రూ. 7.50లక్షలు రెండురోజుల్లో పోగొట్టుకున్నాడు. ఎంపీడీఓ ఫిర్యాదు మేరకు సదరు ఉద్యోగిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని కేవలం రూ.28వేలు మాత్రమే స్వాధీనం చేసుకోగలిగారు. మిగిలిన సొమ్మంతా ఈ బెట్టింగ్‌ల పరమైనట్లు పోలీసులు చెబుతున్నారు

తిరంగా పార్కు అభివృద్ధికి సహకరించాలని వినతి



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని విష్ణుప్రియ నగర్‌లో ఏర్పాటు చేసిన 150 అడుగుల జాతీయజెండా స్థూపానికి చుట్టూత ఏర్పాటు చేసిన తిరంగా పార్కు అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కేసీపీ సిమెంట్స్ ప్రతినిధులను కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రాఘవేంద్ర బుధవారం కేసీపీ సిమెంట్స్ ప్రతినిధులతో మాట్లాడారు. వినతిపత్రాన్ని అందజేశారు. సీఎస్ఆర్ నిధులు మంజూరు చేసి తిరంగా పార్కు అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తిరంగా పార్కు ప్రహరీ, ఓపెన్ జిమ్, గ్రీనరీ అభివృద్ధి, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటుకు నిధులు ఇవ్వాలని కోరగా, వీలైనంత త్వరగా సహాయ సహకారాలు అందిస్తామని కేసీపీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, స్థానిక నాయకులు కల్యాణపు కోటేశ్వరరావు, కేసీపీ ప్రతినిధులు మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్ డేటా అనలిటిక్స్‌తో ఉపాధి అవకాశాలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): బిజినెస్ డేటా అనలిటిక్స్ కోర్సు పూర్తి చేసిన యువతకు ఉపాధి అవకాశాలు అపారంగా ఉంటాయని ఇన్వెంటిజ్ సంస్థ సీఈఓ అన్నె ఇంద్రజిత్ చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల బిజినెస్ అనలిటిక్స్ విభాగం ఆధ్వర్యంలో విశ్లేషక్-2కే25 పేరుతో సాంకేతిక, సాంస్కృతిక అంశాల్లో సిద్ధార్థ ఆడిటోరియంలో బుధవారం విద్యార్థులకు పోటీలు జరిగాయి. ఇంద్రజిత్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. బిజినెస్ అనలిటిక్స్ ద్వారా భవిష్యత్తు వ్యాపారాన్ని, వినియోగదారుని ప్రవర్తన మొదలైన అంశాలను ముందుగానే గుర్తించవచ్చునని చెప్పారు. వినియోగదారుల అభిరుచిని గుర్తించడం ద్వారా వ్యాపార అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కృత్రిమ మేథస్సును బిజినెస్ అనలిటిక్స్‌ను అనుసంధానం చేయడం ద్వారా వేగంగా, సులభంగా కచ్చితమైన సేవలను అందించవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా వారిలోని నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి.జంపాలా మాట్లాడుతూ.. యువతలో కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందటానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో విశ్లేషక్-2కే25 కన్వీనర్ జయ ప్రకాష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు, అధ్యాపకులు జి.గురుప్రసాద్, మహ్మద్ నజియా సుల్తానా, ఎస్.సాయిమోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌పై వెలిగిన లైట్లు

సాక్షి ఎఫెక్ట్



హైవే ఫ్లైఓవర్‌పై వెలుగుతున్న లైట్లు

నందిగామరూరల్: పట్టణంలోని అనాసాగరం నుంచి అంబారుపేట బైపాస్ వైజంక్షన్ వరకు 65వ నంబరు జాతీయ రహదారిపై ఎట్టకేలకు లైట్లు వెలిగాయి. పదిరోజులుగా లైట్లు వెలగకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతుండటంపై 'సాక్షి' దినపత్రిక 'వెలగని వీధిలైట్లు.. ప్రయాణికుల ఇబ్బందులు' శీర్షికను ఓ వార్తను ప్రచురించింది. దీంతో జాతీయ రహదారుల అధికారులు స్పందించి ఫ్లైఓవర్‌పై లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టారు. హైవే ఫ్లైఓవర్‌పై లైట్లు వెలగడంతో ఫ్లైఓవర్ వద్ద హైదరాబాద్ వెళ్లేందుకు ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల కోసం అంబారుపేట వైజంక్షన్, అనాసాగరం వద్ద హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ, ప్రైవేట్‌బస్సులను ఎక్కేందుకు వేచి ఉండే ప్రయాణికులు వారి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తంచేశారు. చిమ్మ చీకటిలో బస్సుల కోసం వేచి ఉండేందుకు ఇబ్బందులుపడుతున్నామని, లైట్లు వెలగడంతో సమస్య పరిష్కరమైందంటూ వారు హర్షం వ్యక్తం చేశారు.

ఆటిజంపై తల్లిదండ్రులకు అవగాహన



మాట్లాడుతున్న హెచ్‌ఎం శివరామ్‌నాయక్, పాల్గొన్న ఉపాధ్యాయులు

జగ్గయ్యపేట అర్బన్: ప్రపంచ ఆటిజం డేను పురస్కరించుకొని పట్టణంలోని సీతారామపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉన్న భవిత సెంటర్‌లో చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం శివరామ్‌నాయక్ మాట్లాడుతూ ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్(ఏఎస్‌డీ) ఉన్నవారు సామాజికంగా ఇతరులతో సంబంధాలను ఏర్పరచుకోవడం, కమ్యునికేట్ చేయడం, కొన్ని రకాల ప్రవర్తనలు పునరావృతం చేయడం తదితర అంశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటుంటారన్నారు. ఇతరుల భావాలను అర్థం చేసుకోలేకపోవడం, ఇతరులతో ఆడుకోవడం, సంభాషించుకోవడంలో ఇబ్బందులు పడుతుంటారన్నారు. ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా వారు ఆయా ఇబ్బందులను అధిగమించేలా చేయవచ్చన్నారు. అనంతరం తల్లిదండ్రులతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో సహిత విద్య వనరుల ఉపాధ్యాయులు డి.ఉదయలక్ష్మి, డి.జానకి, ప్రత్యేక అవసరాలుగల చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాల ధరల పెంపుపై నిరసన



పాల ధర పెంపును నిరసిస్తూ నినాదాలు చేస్తున్న నాయకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గడిచిన ఆర్థిక సంవత్సరంలో లాభాలను గడించిన విజయ డెయిరీ ప్రస్తుతం పాల ధరను పెంచుతూ వినియోగదారులపై భారాలను మోపుతుందని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. పెంచిన పాల ధరలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో బుధవారం పాలప్రాజెక్టు వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయ డెయిరీ ప్రతి ఆరు నెలలకు ఒకసారి పాల ధరలను పెంచడం పరిపాటిగా మారిందన్నారు. ప్రభుత్వాలు పాడి పరిశ్రమలకు సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. మంగళవారం పాల ధరలు పెరిగితే అదే రోజు హోటల్స్‌లో టీ ధరలు కూడా పెంచారన్నారు. పాల ధర పెంపునకు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు నైతిక బాధ్యత వహించాలని తెలిపారు. వెంటనే పెంచిన పాల ధరలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పాలతో పాటు ఇతర పాల ఉత్పత్తుల ధరలు పెరిగే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు నక్క వీరభద్రరావు, బుట్టి రాయప్ప, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణ, డీవీ రమణబాబు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సేవలు గుర్తించాలి



ప్రతిభా పురస్కారాలు అందకున్న వారితో నిర్వాహకులు

విజయవాడకల్చరల్: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని జీఆర్ పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సేవా సంఘం ఆధ్వర్యంలో బందరురోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో బుధవారం సంప్రదాయ వస్త్ర ప్రదర్శన పోటీలు, నూతన తెలుగు సంవత్సరం ఉగాది ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ కవులు, కళాకారులు సాంస్కృతిక వారధులని.. వారి సేవలను గుర్తించాల్సిన అవసముందన్నారు.

శ్రీదేవి సాంస్కృతిక సేవా సంస్థ ఏటా ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేస్తోందని చెప్పారు. శ్రీదేవి సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకురాలు దూపాటి శ్రీదేవి మాట్లాడుతూ సంప్రదాయ వస్త్రాలు ధరించడం ఆత్మగౌరవానికి ప్రతీకగా భావించాలని సూచించారు. ఉగాది సందర్భంగా పచ్చిపులుసు సూర్యనారాయణ, బాడిత శంకర్, పరేష్, వనమా గణేష్, పాయలలక్షణ్, చంద్రిక, నాగజ్యోతి, ఆడిదం ఉషాకుమారిలకు ఉగాది పురస్కారాలను అందించారు. సంప్రదాయ వస్త్రధారణ పోటీల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. నిర్వాహకులు వారికి బహుమతులు అందజేశారు.

ప్రజావేదిక ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష



ప్రజావేదిక ఏర్పాట్లపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

చందర్లపాడు(నందిగామ టౌన్): బాబు జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకుని ఈనెల ఐదోతేదీ శనివారం చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్న ప్రజావేదిక కార్యక్రమం విజయవంతానికి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ తెలిపారు. ముప్పాళ్లలోని వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణ మండపంలో బుధవారం ఆయన ఆయా శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా జిల్లాలో జరుగుతున్న తొలి ప్రజావేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని ప్రజలతో ముచ్చటిస్తారన్నారు. ప్రధానంగా పీ4 విధానంలోని బంగారు కుటుంబాలు, మార్గదర్శకులతో పేదరిక నిర్మూలన ప్రణాళికపై చర్చిస్తారన్నారు. పీ4విధానం తదితర అంశాలపై ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రజా వేదిక విజయవంతానికి కృషి..

అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల బాగస్వామ్యంతో ప్రజావేదిక కార్యక్రమం విజయవంతానికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమ ప్రాంగణం వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముందుగా కార్యక్రమ విజయవంతానికి చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో కన్నమనాయుడు, ఆర్డీవో కె.బాలకృష్ణ, డీపీఓ లావణ్య కుమారి, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖాధికారి శ్రీనివాసశిరోమణి, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

అవగాహనతోనే మోసాలకు అడ్డుకట్ట

నందిగామరూరల్: దైనందిన జీవితంలో వస్తువుల కొనుగోళ్లు నిత్యకృత్యమే. కొనుగోళ్లకు సంబంధించి రసీదులు తీసుకొంటున్నారా.. అంటే సమాధానం కాస్త అటు ఇటుగానే ఉంటుంది.. కానీ, వినియోగదారుల పరిరక్షణ చట్టం మాత్రం ఖచ్చితంగా రసీదు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేస్తోంది. ఆయా వస్తువుల నాణ్యతలో తేడాలు వచ్చినప్పుడు రసీదు ఉంటే తగిన పరిహారం పొందే వీలు కలుగుతుంది.

అవగాహన లేమియే కారణమా?..

నియోజకవర్గంలోని నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు, వీరులపాడు మండలాలలో వేల సంఖ్యలో పలు రకాల దుకాణాలున్నాయి. ఒక్క ఎలక్ట్రానిక్స్, మొబైల్స్ దుకాణాల్లో మిగిలిన ఏ దుకాణాల నిర్వాహకులు కొనుగోలు చేసిన వస్తువులకు సంబంధించి రసీదులు ఇవ్వడం లేదు. వస్తువుల కొనుగోలు తర్వాత రసీదు తీసుకోవాలన్న స్పృహ కూడా రోజురోజుకు జనంలో తగ్గిపోతుండటం గమనార్హం. ఇదే అంశాలకు ఆయా దుకాణాల నిర్వాహకులకు వరంగా మారుతోంది. వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంపై అవగాహన లేమితో ప్రజలు కూడా కొనుగోలు చేసిన వస్తువుకు రసీదు ఇవ్వమని అడగటం లేదు. ఒకవేళ కొందరు బిల్లు అడిగినా వ్యాపారులు మాత్రం తెల్లకాగితంపై ధరలు రాసి ఇస్తున్నారు తప్ప సరైన రసీదును మాత్రం ఇవ్వడం లేదు. రశీదు తీసుకోవడం ద్వారా కొనుగోలు చేసిన వస్తువుల కారణంగా నష్టపోయినా లేక సదరు కంపెనీ, దుకాణదారులు మోసం చేసినా వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం నష్టపరిహారం పొందే వీలుంటుంది.

ఇబ్బంది పడితే ఫిర్యాదు చేయవచ్చు..

మోసాలు, కొలతలు, ఇబ్బందులు, సేవలు ఇలా ఏ అంశంలోనైనా వినియోగదారునికి ఇబ్బంది కలిగితే వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం ద్వారా సమస్య పరిష్కారంతోపాటు పరిహారం కూడా పొందే వీలుంది. వినియోగదారుల సేవలకు ఆటంకం, నష్టం కలిగితే సంబంధిత వ్యక్తులపై ఫిర్యాదు చేయవచ్చు. అంతే కాకుండా రిజిస్టర్డైన వినియోగదారుల సంఘాలు, సమాచార కేంద్రాల నుంచి కూడా నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

అన్ని సేవలు వినియోగదారుల చట్టంలోకే..

వినియోగదారుడు తూకాల్లో మోసపోయినా, సేవలు సక్రమంగా అందకపోయినా, బ్యాంకింగ్, ఆస్పత్రి, రైల్వే, విమానయాన, విత్తనాలు, పురుగు మందులు, విద్య, వైద్యం, వ్యాపారం, బీమా, తపాలా, విద్యుత్, రియల్ ఎస్టేట్, రవాణా, చిట్‌ఫండ్స్, వ్యవసాయం, కొరియర్ సర్వీస్, హౌసింగ్, గ్యాస్ ఇలా అన్నిరకాల వస్తుసేవల విషయంలో ఇబ్బందులు ఏర్పడినప్పుడు వినియోగదారుడు ఫిర్యాదు చేసి నష్టపరిహారం పొందవచ్చు. అంతే కాకుండా మార్కెట్‌లో కొనుగోలు చేసే వస్తువుల నాణ్యత ప్రమాణాల్లో లోపాలు, తేడాలు, ఎమ్మార్పీ కంటే ఎక్కువ వసూలు చేసినా, వస్తువుల్లో ముద్రించిన పరిమాణం కన్నా తక్కువగా ఉండి నష్టపోయినా ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చు. వినియోగదారుని తరఫున వినియోగదారుల పరిరక్షణ సంస్థలకు కూడా వినియోగదారుల ఫోరంలో కేసు దాఖలు చేసుకునే అవకాశం ఉంది.

అవగాహన కరువు..

వినియోగదారుల పరిరక్షణ చట్టం గురించి ప్రజలకు కనీస అవగాహన ఉండటం లేదు. సంబంధిత అధికారులు కూడా అవగాహన కల్పించడంలో అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలు నెలకొన్నాయి. వినియోగదారుల పరిరక్షణ చట్టంపై పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వినియోగదారుల చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది.

ఫిర్యాదు చేసేందుకు కావలసినవి...

- వస్తువు కొనుగోలు చేసినప్పుడు ఖచ్చితమైన, సరైన రసీదు తీసుకోవాలి.
- దాన్ని ఖచ్చితంగా వినియోగదారుల ఫోరంలో సమర్పించాలి.
- వినియోగదారుని పేరు చిరునామా, ఎవరిపై ఫిర్యాదు చేస్తున్నారో వారి పేర్లు, బిల్లు నంబరు సహా రాయాలి.
- మీరు కొనుగోలు చేసిన వస్తువు, సేవల వివరాలు, బిల్లు నంబరు, నష్టం విలువ వివరంగా అంకెల్లో రాయాలి.
- మీరు కోరుకొంటున్న పరిహారం వివరాలను దరఖాస్తులో తప్పనిసరిగా పేర్కొనాలి.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రీ ప్రైమరీ పూర్తిచేసుకొని ఒకటో తరగతిలోకి అడుగు పెడుతున్న చిన్నారులకు ఏజీఎం హరీష్ గోల్డ్‌మెడల్‌తోపాటు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జోనల్ కోఆర్డినేటర్ ఖమర్ జహాన్, ప్రిన్సిపాల్ పవన్ కుమార్, ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ చంద్రకళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.